క్లుప్తంగా

థాంక్యూ సీఎం సార్..



నియామకపత్రాలతో 1998 డీఎస్సీ అభ్యర్థులు

రేగిడి: స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులకు ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు చేతులమీదుగా శనివారం నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు థాంక్యూ సీఎం సార్ అని కృతజ్ఞతలు తెలుపుతూ ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న తమకు ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పోస్టింగ్‌లు ఇచ్చారని, ఆయనకు రుణపడి ఉంటామన్నారు.

పాలసేకరణ కేంద్రం ప్రారంభం



బాలకవివలసలో ప్రారంభించిన పాలసేకరణ కేంద్రం

రేగిడి: మండలంలోని బాలకవివలస గ్రామంలో పాలసేకరణ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. గోద్రేజ్ జెర్సీ డైరీ శాఖ దీనిని ఏర్పాటు చేయగా, రైతులకు ఈ కేంద్రం ద్వారా మంచి లాభాలు అందిస్తామని ఆ సంస్థ జోనల్ మేనేజర్ గోవిందరావు తెలిపారు. లీటరు పాలను నాణ్యత ఆధారంగా రూ.40 నుంచి రూ.60 వరకు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సంస్థ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, శాసపు జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో నొప్పులు మాయం

బాడంగి: నడి వయస్కులకు వస్తున్న కీళ్ల, శారీరక నొప్పులు ఫిజియోథెరపీతో తగ్గించవచ్చని విశాఖకు చెందిన ఫిజియోథెరపిస్టు సీహెచ్ రమేష్ తెలిపారు. డీఈఓ లింగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంఈఓ రాజేశ్వరి అధ్యక్షతన ఫిజియోథెరపీపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలో హద్దుల గుర్తింపు



సతివాడలో భూముల సరిహద్దులు గుర్తిస్తున్న వీఆర్‌ఓలు, సచివాలయ సర్వేయర్లు

తెర్లాం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని సతివాడ గ్రామంలో శనివారం గ్రౌండ్ ట్రూథింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రత్నకుమార్ మాట్లాడుతూ, రైతుల సమక్షంలో హద్దులు గుర్తించాలన్నారు. రైతులు సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు.

మహిళలు, చిన్నారుల రక్షణే ధ్యేయం

బొబ్బిలి: మహిళలు, చిన్నారుల రక్షణే ధ్యేయంగా ఐసీడీఎస్ పనిచేస్తోందని సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని గొల్లపల్లి, తదితర ప్రాంతాలతో పాటు మండలంలోని పారాది, తదితర గ్రామాల్లో శనివారం సఖి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా రక్షణ, పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలు, బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ వల్ల కలిగే నష్టాలపై వివరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రుచి, శుచి తప్పనిసరి

వంగర: మండలంలోని అరసాడ గ్రామ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ వై.దుర్గారావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనం వంటకాలను ఆయన రుచి చూసి పరిశీలించారు. పదార్థాలన్నీ రుచి, శుచి కలిగి ఉండాలని, మెనూ ప్రకారం భోజనాలు వండి పెట్టాలని తెలిపారు.

రక్షణ పరికరాలతో విధులు

బొబ్బిలి: కార్మికులు పరిశ్రమల్లో విధులు నిర్వహించేటప్పుడు పరిశ్రమల యాజమాన్యాలు అందజేసిన రక్షణ పరికరాలు వినియోగించుకోవాలని బొబ్బిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.సరోజనమ్మ అన్నారు. శనివారం స్థానిక గ్రోత్ సెంటర్‌లోని బెర్రీ ఫెర్రో అల్లాయీస్ పరిశ్రమలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి టి. వాసుదేవన్ ఆదేశాలతో నిర్వహించిన ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ, హక్కులతో పాటు విధులు కూడా సక్రమంగా నిర్వహించాలన్నారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని గాయత్రికాలనీకి చెందిన పి.ప్రసాద్‌పై గొల్లవీధికి చెందిన అప్పన్నతో పాటు మరో వ్యక్తి దాడిచేసి గాయపర్చినట్లు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీబీ రామకృష్ణ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. స్థానిక మెయిన్‌రోడ్డులోని చౌదరి బార్ వద్దకు శనివారం వచ్చిన ప్రసాద్ వద్ద గొల్లవీధికి చెందిన అప్పన్న వేరొకరికి ఫోన్ చేయాలని ఫోన్ తీసుకున్నారు. మాట్లాడిన తర్వాత ఫోన్ ఇవ్వకుండా తనకు మందు ఇస్తే ఫోన్ ఇస్తానని అన్నాడు. అక్కడ ఉన్నవారు కొంతమంది మందలించడంతో ఫోన్ ఇచ్చి, వెళ్లిపోయి గొల్లవీధి నుంచి కొంతమందిని తీసుకువచ్చి, తనపై దాడిచేసినట్లు ప్రసాద్ పేర్కొన్నాడు. గాయపడిన ప్రసాద్‌ను ప్రాంతీయ ఆస్పత్రికి తరలించి, చికిత్సనందించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

పక్కాగా 'జగనన్న సురక్ష'

- మండల ప్రత్యేకాధికారి గోవిందరావు



వంగర: అరసాడలో జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమంలో భాగంగా సర్వే చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు తదితరులు



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి గోవిందరావు



బాడంగి: కోడూరులో జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఆంజనేయులు



తెర్లాం: ఆమిటిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి



తెర్లాం: మండల కేంద్రంలో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు, పక్కన ఎంపీడీఓ రామకృష్ణ



బొబ్బిలి: పట్టణంలో చేపడుతున్న సురక్ష సర్వే

రామభద్రపురం: ప్రజల కోసం జూలై ఒకటో తేదీ నుంచి నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి గోవిందరావు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశపు భవనంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా జూలై ఒకటో తేదీ నుంచి 22 వరకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ, తహసీల్దార్ రెండు బృందాలుగా ఏర్పడి మండలంలోని 17 గ్రామ సచివాలయాల పరిధిలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు మంజూరు చేయడంతో పాటు ఇతర సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. ఒకటో తేదీన రొంపల్లి, సోంపురం.. 4న కొట్టక్కి, నాయుడువలస.. 6న ఆరికతోట, గొల్లపేట.. 11న కోటశిర్లాం, జన్నివలస.. 13న కొండకెంగువ, తారాపురం.. 15న బూసాయవలస, దుప్పలపూడి.. 18న రామభద్రపురం – 2, రావివలస.. 20న రామభద్రపురం–3, పాతరేగ.. 22న రామభద్రంపురం–1 సచివాలయాల పరిధిలో కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజారావు, ఎంపీడీఓ రమామణి, తదితరులు పాల్గొన్నారు.

కోడూరులో..

బాడంగి: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండంలోని కోడూరులో చేపట్టిన గృహ సందర్శనను ఎంపీడీఓ ఆంజనేయులు పరిశీలించారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకోవడంతో పాటు అవసరమైన ధ్రువపత్రాల మంజూరుకు చర్యలు తీసుకోవడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భోగి గౌరి, సలహాదారు తెంటు మధుసూదనరావు, మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, గ్రామ ఉప సర్పంచ్ రెడ్డి కృష్ణ, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ప్రజలకు ఎంతో మేలు ..

తెర్లాం: జగనన్న సురక్ష కార్యక్రమంతో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెర్లాం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అన్నారు. మండలంలోని ఆమిటి గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజలు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజలు, విద్యార్థులు, రైతులకు అవసరమైన 11 రకాల సిటిజన్ సర్వీసులను ప్రభుత్వం ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ, జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామరావు, కూనాయవలస సర్పంచ్ బోడెల విజయబాబు, ఆమిటి పంచాయతీ కార్యదర్శి చింతల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్షా కార్యక్రమాన్ని ప్రజలు, రైతులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, చీపురుపల్లి డీఎల్‌డీఓ వి.లక్ష్మణరావు అన్నారు. మండల కేంద్రంలో ప్రారంభమైన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ వలంటీర్లు జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజలకు ఏవిధంగా అవగాహన కల్పిస్తున్నారు, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న 11 రకాల సేవలపై ప్రజలకు ఎలా వివరిస్తున్నారో పరిశీలించారు. అనంతరం మండల ప్రత్యేకాధికారి మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాల ద్వారా అర్హత ఉన్న వారికి ఏదైనా పథకం అందకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి సూరిబాబు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు హరి, మాధురి, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

జోరుగా సర్వే..

బొబ్బిలి: జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించిన సర్వే జోరుగా సాగుతోంది. పట్టణంలోని 16 సచివాలయాల పరిధిలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణ జేసీఎస్ కన్వీనర్ రేజేటి ఈశ్వరరావు(విసు) పలు వార్డుల్లో పర్యవేక్షించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో జరిగిన సర్వేను తహసీల్దార్ డోల రాజేశ్వరరావు పరిశీలించారు.

రాజాం: ప్రతీ ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమ లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి భీంపల్లి సుధాకర్‌రావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశమైన ఆయన జూలై 1వ తేదీ నుంచి వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులు, అధికారులు ఇంటింటికీ వెళ్లి, ప్రజా సమస్యలు తెలుసుకోవాలని, అలాగే అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోతే వారి వివరాలు సేకరించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన జనన, మరణ, కుల, ఆదాయ వంటి ధ్రువీకరణ పత్రాల అందజేతకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమస్యలు పరిష్కరించలేదనే ఫిర్యాదులు ప్రజల నుంచి వస్తే సంబంధిత వార్డు వలంటీర్లతో పాటు సచివాలయ ఉద్యోగులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.శంకరరావు, తహసీల్దార్ ఎస్.కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని వాసుదేవపట్నం గ్రామంలో జరుగుతున్న జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమ సర్వేను ఎంపీడీఓ జి.వి.రవికుమార్ శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాల అర్హులను గుర్తించాలని, ప్రజాసమస్యలు సేకరించి, పరిష్కారానికి వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు.

వంగర: మండలంలోని అరసాడ గ్రామంలో జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమంలో భాగంగా ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా సర్వే నిర్వహించారు. అర్హులై ఉండి పథకాలు అందుకోని వారు ఎవరైనా ఉంటే తెలపాలని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు కోరారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే మహిళలకు సుస్థిర జీవనం



డ్వాక్రా ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

- అర్బన్ మహిళా మార్కెట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ హయాంలోనే మహిళల సుస్థిర జీవనం సాధ్యమైందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన (అర్బన్ మహిళా మార్కెట్) డ్వాక్రా బజార్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు వివిధ రకాల పొదుపు రుణాలు, సబ్సిడీలు అందించడమే కాకుండా సంక్షేమ పథకాలన్నింటిలోనూ వారినే భాగస్వామ్యులను చేస్తోందన్నారు. అనంతరం మహిళలు స్వయంగా తయారు చేసిన పలు ఉత్పత్తులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైస్ చైర్మన్లు చెలికాని మురళి, రమాదేవి, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు(విసు), కమిషనర్ ఎస్. శ్రీనివాసరావు, మెప్మా సీఎంఎం రాము, పట్టణ అధ్యక్షురాలు తూముల బంగారురాణి, డ్వాక్రా మహిళలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల ఆస్పత్రిలోకి మురుగు..

- అనుమతి లేకుండా చెట్ల నరికివేత
- ఓ వ్యాపారి దౌర్జన్యం
- చోద్యం చూస్తున్న అధికారులు



పైపుల ద్వారా ఆస్పత్రిలోకి మళ్లిస్తున్న మురుగు నీరు



ఆస్పత్రి ఆవరణలో నరికేసిన చెట్టు

రామభద్రపురం: మండల కేంద్రంలోని ఓ వ్యాపారి తన అపార్ట్‌మెంట్ నుంచి బయటకు పోవాల్సిన మురుగునీటిని పెద్ద పెద్ద పైపులతో నేరుగా పశువుల ఆస్పత్రి ఆవరణలోకి మళ్లించేస్తున్నాడు. అలాగే ఎటువంటి అనుమతులు లేకుండా ఆస్పత్రి ఆవరణలోని పెద్ద పెద్ద చెట్లను నరికించేశాడు. ఇదేం పని అని అడిగిన వారికి మీకేంటి సంబంధం అని దబాయిస్తున్నాడు. అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రంలోని ఓ వ్యాపారి పశువుల ఆస్పత్రికి కొద్ది దూరంలో పెద్ద అపార్ట్‌మెంట్ నిర్మించాడు. ఆ అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన మురుగునీరు బయటకు పోయేందుకు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. దీంతో పక్కన ఉన్న పశువుల ఆస్పత్రి ఆవరణలోకి పెద్ద పెద్ద పైపులు వేసి మురుగునీటిని విడిచిపెడుతున్నాడు. అలాగే ఆస్పత్రి ఆవరణలోని పెద్ద పెద్ద చెట్లను సైతం నరికించేశాడు. ఆస్పత్రి ఆవరణలోకి మురుగునీరు విడిచిపెట్టడం వల్ల ఇబ్బందిగా ఉందని పశువులను తీసుకువచ్చే రైతులు చెబుతున్నారు. చెట్లను ఎందుకు నరికారని అడిగితే ఇష్టానుసారంగా సమాధానం చెబుతున్నాడని పశు వైద్యాధికారి హిరణ్య, సిబ్బంది తెలిపారు. అపార్ట్‌మెంట్ మరుగుదొడ్ల మురుగు నీరు ఆస్పత్రి ఆవరణలోకి రావడంతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు

తెర్లాం: జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యలను వెంట వెంటనే పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి వి. లక్ష్మణరావు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు మాట్లాడుతూ, 1902 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా వచ్చిన సమస్యలతో పాటు మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే జగనన్నకి చెబుదాం కార్యక్రమంలో వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. సమస్య పరిష్కారం కాకపోతే అందుకు గల కారణాలను వివరించాలన్నారు. ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ మాట్లాడుతూ, గ్రామాల్లో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై మండల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ రత్నకుమార్, హౌసింగ్ డీఈ పి.అప్పయ్య, ఈఓపీఆర్‌డీ రాంబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

- ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి, తదితరులు

మెంటాడ: మండలంలోని ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ భవనాలను జూలై నెలాఖరు నాటికి పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం. వెంకటేశ్వర్లు ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పూర్తయిన అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులతో ప్రారంభించాలని సూచించారు.

బడేవలసలో హౌసింగ్‌డే

బడేవలసలో హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గ్రామానికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా 33 ఇళ్లు మంజూరు కాగా, 24 పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన ఇళ్లు జూలై నెలాఖరకు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ త్రివిక్రమ్, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులను వేగవంతం చేయాలి



మండల అభివృద్ధి చర్యలపై సమీక్షిస్తున్న స్పెషల్ ఆఫీసర్ పద్మలత

సంతకవిటి: నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని స్పెషల్ ఆఫీసర్ కె.పద్మలత సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో శనివారం సమావేశమైన ఆమె మండలాభివృద్ధికి చేపడుతున్న చర్యలపై సమీక్షించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఉపాధిహామీ పనుల వేతనదారులకు రోజుకు రూ.272 వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని, జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమ విజయవంతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణతో స్వయం ఉపాధి



శిక్షణార్థులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి

రాజాం: కుట్టుమిషన్ శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి దొరుకుతోందని డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న కుట్టుమిషన్ శిక్షణ తరగతులను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం శిక్షణార్థులతో మాట్లాడి, శిక్షణ ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో ఆసక్తి ఉన్న వారికి విజయవాడలో ఉద్యోగం కల్పిస్తామన్నారు. స్వయంగా కుట్టుమిషన్ పెట్టుకుంటే రుణ సదుపాయం వచ్చేలా చూస్తామన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నావడ్డీ రుణాలతో మహిళా సంఘాల సభ్యులకు ఆర్థికంగా అండగా నిలుస్తోందని, తాజాగా కేంద్ర ప్రభుత్వం సాయంతో మహిళా సంఘాల్లోని మహిళలు, వారి పిల్లలకు కుట్టుమిషన్ శిక్షణ ఇచ్చి, వారి కాళ్లపై వాళ్లు నిలబడేలా చేస్తోందన్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో జిల్లాలో ఎస్.కోట, గజపతినగరం, బొబ్బిలి, నెల్లిమర్ల, గరివిడి, చీపురుపల్లి, రాజాం, వంగర, ఆర్.ఆమదాలవలస, విజయనగరం ప్రాంతాల్లోని మహిళా సమాఖ్య కేంద్రాల వద్ద కుట్టుమిషన్ శిక్షణ తరగతులు జరుగుతున్నాయని, ఒక్కో చోట 30 మందికి 90 రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. శిక్షణార్థులకు మధ్యాహ్న భోజనం వసతి కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాజాం ఏసీ చిరంజీవి, ఏపీఎం టి.దధికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికులతో పని చేయించడం నేరం

బాడంగి: బాల కార్మికులతో పనులు చేయించడం నేరమని, ఎవరైనా పనుల్లో పెడితే వారిపై కేసులు నమోదు చేస్తామని బాలల హక్కుల కమిటీ సభ్యులు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో కమిటీ సభ్యులు శనివారం తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ గౌరీశంకరరావు, స్వచ్ఛంద సంస్థ కార్యకర్త ఆర్.సరస్వతి, ఎన్‌జీఓ జి.ఝాన్సీరాణి, ఏఎస్సై కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానపంటల సాగుపై అవగాహన



రైతులతో మొక్కలు నాటిస్తున్న ఏపీఓ సాయిరాం

రాజాం: మండలంలోని సోపేరు గ్రామంలో ఉద్యాన పంటల సాగుపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పంపిణీ చేసిన మామిడి, సపోటా, జామ, కొబ్బరి తదితర పండ్ల జాతి మొక్కలను పొలాల్లో నాటడం, వాటి సంరక్షణ చర్యలను ఏపీడీ మీసాల శ్రీనివాసరావు, ఏపీఓ సాయిరాం వివరించారు. ఆసక్తి ఉన్న వారికి ఈ మొక్కలను ఉచితంగా అందజేస్తున్నామని, కావాల్సిన వారు గ్రామంలోని ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలని కోరారు. అనంతరం పొలాల్లో ఆయా జాతి మొక్కలను రైతులతో నాటించారు.

సంక్షిప్తంగా...

నోట్ పుస్తకాల వితరణ

రాజాం: మండలంలోని కొండంపేటకు చెందిన ఉప్పల సంతోష్‌కుమార్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు శనివారం వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయుడు కుమరాపు చంద్రినాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రజలు ఇలా భాగస్వాములు కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు హరిబాబు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

బొబ్బిలి: భోగస్ హాజరు లేకుండా ఉపాధి పనుల్లో పారదర్శకత పాటించాలని ఏపీడీ జనార్దనరావు అన్నారు. మండలంలోని కొత్తపెంట, రంగరాయపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం పరిశీలించి, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలకు పలు సూచనలు చేశారు.

మొక్కలను సంరక్షించాలి

రేగిడి: ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా మండలంలోని మజ్జిరాముడుపేట, అప్పాపురం, లక్ష్మీపురం, కొమిర గ్రామాల్లో ఉపాధి హామీ పనుల వేతనదారులతో నాటిన మొక్కలను ఏపీఓ ఎస్.హరనాథ్ శనివారం పరిశీలించారు. పశువులు తినేయకుండా వాటిని సంరక్షించాలన్నారు.

బాధ్యతల స్వీకరణ

రేగిడి: మండల పరిషత్ ప్రత్యేకాధికారిగా డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో సమావేశమైన ఆయన మండల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమ విజయవంతంపై చర్చించారు.

నేడు రారవే సమావేశం

రాజాం సిటీ: స్థానిక విద్యానికేతన్ స్కూల్‌లో ఆదివారం రాజాం రచయితల వేదిక(రారవే) సమావేశం నిర్వహిస్తున్నట్లు రారవే నిర్వాహకులు గార రంగనాథం ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. రచయిత ఆల్తి మోహనరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో రాజాపు శాంతారావు 'అర్ధనారి నవల–సామాజిక పరిశీలన' అనే అంశంపై ప్రసంగించనున్నామన్నారు. కార్యక్రమానికి రచయితలు, తెలుగు భాషాభిమానులు, సాహిత్యాభిమానులు హాజరుకావాలని కోరారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్

రేగిడి: విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఉనుకూరు, కాగితాపల్లి, పారంపేట గ్రామాల్లో పర్యటించిన ఆయన ఈ నెల 30వ తేదీన అన్ని సబ్‌స్టేషన్‌ల వద్ద విద్యుత్ అధిక చార్జీలను వ్యతిరేకిస్తూ ధర్నా నిర్వహిస్తున్నామని, అందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు తిరుపతిరావు, త్రినాధరావు, రాములమ్మ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా విద్యాహక్కు చట్టం అమలు

బొబ్బిలి: విద్యాహక్కు చట్టం పక్కాగా అమలయ్యేలా చూడాలని ఎస్ఎఫ్ఐ మండల శాఖ ప్రతినిధులు కోరారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్ యూనిఫారాలు, పుస్తకాలు విక్రయిస్తోందని ఆరోపిస్తూ, ఆ స్కూల్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీ సభ్యుడు కె. మణికుమార్ మాట్లాడుతూ, స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



అంతకాపల్లి సచివాలయ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీఈఈ చలం

రాజాం: గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు వంటి ప్రభుత్వ భవన నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని క్వాలిటీ కంట్రోల్ డీఈఈ డీవీ చలం కాంట్రాక్టర్లకు సూచించారు. శనివారం మండలంలోని అంతకాపల్లి గ్రామంలో నిర్మాణ దశలోని సచివాలయ భవనాన్ని పరిశీలించిన ఆయన నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలని, త్వరితగతిన నిర్మాణాల పూర్తికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయన వెంట క్వాలిటీ కంట్రోల్ ఏఈ వి.రామకృష్ణారావు, పీఆర్ జేఈ ప్రభాకరరావు, సర్పంచ్ వి.చిన్నంనాయుడు తదితరులు ఉన్నారు.